మేటలనూ మేసేస్తున్నారు

- ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా బుడమేరులో ఇసుక తవ్వకాలు
- తహసీల్దార్ అనుమతితో యథేచ్ఛగా ఇసుక రవాణా
- నాణ్యతలేని ఇసుక సీసీ రోడ్ల నిర్మాణానికి తరలింపు





మైలవరం శివారులోని బుడమేరులో ట్రాక్టర్లకు ఇసుకను లోడు చేస్తున్న కూలీలు (ఇన్‌సెట్) బుడమేరు వాగు నుంచి ఇసుక లోడుతో బయటకు వస్తున్న ట్రాక్టర్

జి.కొండూరు: అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్లు తయారైంది అధికార పార్టీ నాయకుల తీరు. వరదలకు బుడమేరులో వేసిన ఇసుక మేటలపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. సీసీ రోడ్లకు ఇసుక తరలింపు అంటూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక రవాణాను ప్రారంభించారు. ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండా తహసీల్దార్ అనుమతించడం ఒక ఎత్తయితే సీసీ రోడ్ల నిర్మాణానికి మట్టితో కూడిన బుడమేరు ఇసుకను తరలించడం కొసమెరుపు. దీనికి అధికారులు వత్తాసు పలకడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మైలవరానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మైలవరంలో సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. ఇదే అక్రమార్కులకు ఆదాయ మార్గంగా మారింది. ఇసుక కొరత కూడా ఉండటంతో ముందస్తు వ్యూహంలో భాగంగా సీసీ రోడ్లకు ఇసుక కావాలంటూ 90 క్యూబిక్ మీటర్లు, 180 క్యూబిక్ మీటర్లు, 200 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకానికి అనుమతి కోరారు. పంచాయతీరాజ్ ఏఈతో అనుమతి లెటర్‌ను ఎంపీడీఓకి, అక్కడి నుంచి తహసీల్దార్‌కు పంపేలా చేశారు. ఇసుక తవ్వకానికి అనుమతి కావాలంటూ ఎంపీడీఓ నుంచి అలా లెటర్ వచ్చిందో లేదో తహసీల్దార్ వెంటనే అనుమతి ఇచ్చేశారు. అయితే ఇసుక తవ్వకాలు జరిపేది బుడమేరు వాగులో కాబట్టి ఇరిగేషన్ అధికారుల నుంచి కూడా అనుమతి పొందాల్సి ఉంది. కానీ అక్రమార్కులు అవేమీ పట్టించుకోకుండా తహసీల్దార్ అనుమతిచ్చారు కాబట్టి తమకు ఇక ఎదురు లేదని పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఆదివారం ఉదయం నుంచి ఇసుకను తరలించడం ప్రారంభించారు. సాక్షాత్తూ మైలవరం పోలీసు, రెవెన్యూ కార్యాలయాలకు సమీపంలోని బుడమేరు వాగులో ఈ తతంగమంతా కొనసాగింది. సీసీ రోడ్ల నిర్మాణం ముసుగులో ప్రైవేటు వ్యక్తులకు కూడా ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఒక్కో అధికారి ఒక్కో విధంగా..

బుడమేరు ఇసుక తవ్వకాలపై ఎంపీడీఓ అనూరాధను 'సాక్షి' వివరణ కోరగా నిబంధనలు తనకు తెలియదని పంచాయతీరాజ్ ఏఈని అడగాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. బుడమేరు వాగులో ఇసుక తవ్వకానికి అనుమతి ఇచ్చారా అని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా మీరెలా అనుమతి ఇచ్చారంటూ 'సాక్షి' ప్రశ్నించగా ఇరిగేషన్‌కు, ఈ ఇసుక తవ్వకాలకు సంబంధం లేదన్నారు. తాను ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతానని తన వివరణ ముగించారు. దీనిపై బుడమేరు ఏఈ వెంకటేశ్‌ని ప్రశ్నించగా బుడమేరులో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతి లేదని, తవ్వకాలు ఆపేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సమాచారం అందించామని చెప్పారు. ఇసుక తవ్వకాలపై అధికారులు ఎవరికివారే తమ స్టైల్లో ఇచ్చిన సమాధానాలను బట్టి బుడమేరులో ఇసుక తవ్వకాలు అక్రమమేనని స్పష్టమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

బుడమేరు ఇసుక ప్రమాదమే

బుడమేరు వాగులో వచ్చే ఇసుకలో మట్టి కలిసి ఉండటంతో పాటు మెత్తగా ఉండడం వల్ల నిర్మాణాలలో పగుళ్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రైవేటు కట్టడాలకే బుడమేరు ఇసుక వాడడానికి ఆలోచిస్తున్న క్రమంలో ప్రభుత్వ నిర్మాణాలకు బుడమేరు ఇసుక వాడటం అనేది నిబంధనలకు విరుద్ధమని విమర్శలు వస్తున్నాయి. ఈ ఇసుకను ప్రభుత్వ కట్టడాలు, సీసీ రోడ్ల నిర్మాణంలో వాడితే అతి తక్కువ కాలంలోనే నిర్మాణాలు పగుళ్లు వచ్చి ధ్వంసమైపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

గోదాములు తనిఖీ చేసిన ఆర్డీఓ



తిరువూరు: తిరువూరు ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన కె. మాధురి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులకు సరఫరా చేసే నిత్యావసర సరుకులకు సంబంధించి గోదాముల్లో నిల్వలు, రికార్డులతో సరి చూశారు. వినియోగదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు. గోదాము ఇన్‌చార్జి నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి కర్ర తుమ్మ చెట్ల కొమ్మలు

పొంచి ఉన్న ప్రమాదం



గంపలగూడెం: గంపలగూడెం–తిరువూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పెరిగిన కర్ర తుమ్మ చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. 16 కిలోమీటర్ల పొడవున ఉన్న రహదారి మార్జిన్లలో అనేకచోట్ల కర్ర తుమ్మచెట్లు దట్టంగా పెరిగాయి. చెట్ల కొమ్మలు పలుచోట్ల రహదారిపై వాలిపోయి ఎదురుగా వచ్చే వాహనాలను దాటే సమయంలో చెట్ల కొమ్మలు తగిలి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద చెట్ల కొమ్మలు రాసుకుని వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. చెట్ల కొమ్మలు రహదారిపై వంగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాన్ని దగ్గరకు వచ్చే వరకు గుర్తించే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రహదారి పైకి వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపునకు చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

స్వర్గపురికి రూ. లక్ష విరాళం



తిరువూరు: స్థానిక మునుకుళ్ల రోడ్డులో పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న స్వర్గపురి అభివృద్ధి నిమిత్తం తిరువూరుకు చెందిన ఓ దాత రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. నాళ్లా నారాయణ, అనసూయమ్మల జ్ఞాపకార్థం కుమారులు నాళ్లా అప్పారావు, శ్రీనివాసరావులు విరాళాన్ని అందజేశారని తోసా సభ్యులు కలకొండ రవికుమార్, నాళ్లా కాశీ తెలిపారు.

నదిలో దిగి మత్స్యకారుల నిరసన

పరిహారం ఇప్పించాలని డిమాండ్



దాములూరు(ఇబ్రహీంపట్నం): వరద ముంపునకు గురైన మత్స్యకారులను ఆదుకుని నష్ట పరిహారం ఇప్పించాలని దాములూరుకు చెందిన మత్స్యకారులు కృష్ణానది ఒడ్డున నీటిలో దిగి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నది ఒడ్డు గ్రామంలో సుమారు 90 మందికి చెందిన వలలు, పడవలు వరద ప్రవాహానికి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని వారు చెప్పారు. ప్రభుత్వ పరిహారం అందక మరలా చేపల వేట ప్రారంభించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మత్స్యకారులకు ప్రకటించిన పరిహారం కొంతమందికి మాత్రమే అందిందన్నారు. కొందరికి ఇప్పటివరకు పరిహారం అందలేదని వాపోయారు. గ్రామంలోని మత్స్యకార సొసైటీలోనే అవకతవకలు జరిగి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని వారు కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని వ్యవసాయాధికారి బి.శివ శంకర్ అన్నారు. మండలంలోని ఆరుగొలనుపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని వివరించారు.

వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ



ముసునూరు: ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల భాగస్వామ్యానికి సంబంధించిన అంశాలపై మాస్టర్ ట్రైనర్, చింతలవల్లి పంచాయతీ కార్యదర్శి నీరజ సమగ్ర అవగాహన కల్పించారు. ఎంపీపీ కొండా దుర్గా భవానీ, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్‌లు విజయలక్ష్మి, పుట్ల మోహనరావు, ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి

నూజివీడు: ఎంప్లాయిస్ కాలనీలోని ఎమ్మార్ అప్పారావు పార్కును అభివృద్ధి చేయాలని, పార్కులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు వాకర్స్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్కులో దశాబ్దాల కిందట నాటిన మొక్కలు నేడు మహా వృక్షాలయ్యాయని, దీంతో పార్కులోకి గాలి, వెలుతురు సరిగా రావడం లేదని వారు చెప్పారు. పార్కు మధ్య భాగంలో నీళ్ల నిలుస్తుండటంతో దోమలు వృద్ధి చెందాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకసారి పార్కును సందర్శించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షులు ఎస్ఆర్ హనుమాన్లు, పలువురు వాకర్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి టిప్పు సుల్తాన్

ఎ.కొండూరు: రబీ మొక్కజొన్న సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి టిప్పుసుల్తాన్ అన్నారు. గొల్లమండల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు విత్తనాలు వేసుకోవాలన్నారు. సంకర రకాలకు విత్తన మోతాదు ఎకరానికి 8 కిలోలు, సాళ్ల మధ్య దూరం 60 సెంటిమీటర్లు, మొక్కల మధ్య దూరం 20 సెంటిమీటర్లు ఉండేటట్లుగా చూసుకోవాలన్నారు.

విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కజొన్నకు ఆశించే తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. విత్తిన 48 గంటల లోగా పెండిమిథాలిన్ ఎకరాకు ఒక లీటరు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ రామచంద్రరావు, ఆర్ఎస్‌కే సిబ్బంది, నవీన్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

తిరువూరురూరల్: వావిలాల, వామకుంట్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను రైతులతో కలిసి వ్యవసాయాధికారి పద్మ పరిశీలించారు. పలు చోట్ల ఆకుముడత తెగులు ఆశించడంతో వరి పైరుకు నష్టం చేకూరే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. గొంగళిపురుగు ఆకు ముడతల్లో ఉండే పత్రహరితాన్ని తినడం వలన ఆకులు తెల్లబడిపోతాయని, ఈ పురుగు ఆశిస్తే పంటకు ఎక్కువ నష్టం చేకూరుతుందని చెప్పారు. సస్యరక్షణ చర్యలతో పంటను తెగుళ్ల బారినుంచి కాపాడుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: మండలంలోని నర్సపేట, వెంకటాయపాలెంలో వ్యవసాయ, అనుబంధల శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పెట్టుబడులు ఎలా తగ్గించుకోవాలి అనే అంశంపై, వరి, మామిడి, కూరగాయల పైర్లలో తీసుకోవాల్సిన పోషక యజమాన్యంపై రైతులకు వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి అవగాహన కల్పించారు. అనంతరం వరిలో కాండం తొలుచు పురుగు, సుడిదోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉద్యాన అధికారి ఆర్.హేమ, వీహెచ్ఏ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మేకల డేవిడ్, రైతులు

ఎ.కొండూరు: మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి నాగమణిమ్మకు వారు వినతిపత్రం అందించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించిన షాపు యాజమానిపై, విత్తనాలు తయారు చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎ.కొండూరు గ్రామానికి చెందిన రైతులు, కౌలు రైతులకు తిరువూరులోని ఒక ఫెర్టిలైజర్ షాపు యజమాని నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించడంతో రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టం వాటిల్లిన మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారని చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హామీ ఇచ్చారు. కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు బి. రమేష్, కౌలు రైతు సంఘం నాయకులు బి. వెంకటేశ్వరరావు, బి. గిరిబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆగిరిపల్లి: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు మత్తు పదార్థాలు–సోషల్ మీడియా దుర్వినియోగంపై నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నీ తోడు మానసిక వికాస్ కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ ప్రియాంక, ఎంపీహెచ్ఈఓ రత్నబాబు, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

తిరువూరు: తమిళనాడులోని ఓ పరిశ్రమలో భారత కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. తమిళనాడులోని పరిశ్రమలో అక్రమంగా కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అక్కడి కార్మికులు చేస్తున్న నిరసనకు మద్దతుగా తిరువూరులో ఈ ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ గత 28 రోజులుగా అక్కడ సమ్మె చేస్తున్నా కార్మికులను యాజమాన్యం చర్చలకు పిలవకుండా విధుల నుంచి తొలగించడం కార్మిక చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. ఆ పరిశ్రమపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు ముఖ్యం

ఆగిరిపల్లి: రైతులు పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించ వచ్చని మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు అన్నారు. మండలంలోని వడ్లమానులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కనక మహాలక్ష్మి మామిడి, మినప తోటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పంటకు ఏ మందు వాడాలో అవగాహన పెంచుకోవాలని చెప్పారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక, గ్రామ ఉద్యాన సహాయకులు సాయి, సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ శాఖాధికారులు కొండపల్లి సెక్షన్‌లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజయవాడ రూరల్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ హనుమయ్య, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 42 బృందాలుగా ఏర్పడి 3,031 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న 168 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. రూ.6,40,844 జరిమానా విధించారు. వినియోగదారులు అదనపు లోడు వినియోగిస్తే క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ కేవై కొండలరావు, విజిలెన్స్ డీఈఈ హరికిరణ్, రూరల్ డివిజన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

- మద్యం షాపులకు 123 దరఖాస్తులు

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో మద్యం షాపుల ఏర్పాటు కోసం ఇప్పటి వరకు 123 దరఖాస్తులు వచ్చాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జోశ్యుల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఇవికాక ఆన్‌లైన్‌లో కొందరు దరఖాస్తు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 10 మద్యం షాపులు ఏర్పాటు చేయనున్నారని ఆయన వివరించారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే



కోట మహిషాసురమర్దని అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



గంపలగూడెం గాంధీ సెంటర్‌లో సామూహిక సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



నెమలిలో విజయలక్ష్మిగా అమ్మవారు



కొండపల్లి చెన్నకేశవ ఆలయంలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు



గంపలగూడెం మండలం ఆర్లపాడులో అమ్మవారు



కొటికలపూడిలో కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ



తిరువూరు మండలం వామకుంట్ల సెంటర్‌లో ధనలక్ష్మీ దేవిగా అలంకరణ



మైలవరం పాండురంగస్వామి ఆలయంలో కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం అమ్మవార్లు మహాలక్ష్మి అలంకారంలో, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలు, పందిళ్ల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ కమిటీల నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



చనుబండ మెయిన్ రోడ్డులోని అమ్మవారి ప్రతిమకు పూజలు



నూజివీడు శివాలయంలో శ్రీ మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



బలివేలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన్న అమ్మవారు



తిరువూరు గౌరీ కేదారేశ్వరాలయంలో ధనలక్ష్మీదేవి అలంకారం



తిరువూరు యాదవ బజార్‌లో ధనలక్ష్మీ అలంకారం



ఆగిరిపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో మహాలక్ష్మి అలంకరణ